సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 22 । ఆగస్టు । 2025



దేశ రక్షణలో తెలుగు బిడ్డ సాహసం 10లో



అట్టహాసంగా కళా ఉత్సవ్ 10లో



ఉత్కంఠగా రైల్వేస్ బాల్ బ్యాడ్మింటన్ పోరు 10లో

రైలులో లగేజీ
మరింత భారం



- విమానాల తరహాలో వాతపెట్టేందుకు సిద్ధం
- ఎప్పట్నుంచో ఆంక్షలున్నా.. ఇక పక్కాగా అమలు
- ఫస్ట్ ఏసీ ప్రయాణికులకు 70 కిలోలే గరిష్టం
- స్లీపర్ క్లాస్ అయితే 40 కిలోలు దాటితే జరిమానా
- ఎక్కువ బరువు ఉంటే.. ముందస్తు బుకింగ్ అవసరం
- లేదంటే ఒకటిన్నర రెట్లు ఫైన్ కట్టాల్సిందే.!
- బ్యాగ్ పెద్దదైనా బాదుడు తప్పదు

సాక్షి, విశాఖపట్నం: రైలు ప్రయాణం..అన్నీ సర్దేసుకుని పట్టేసుకుందాం. సీటు కింద బ్యాగులు ఇష్టం వచ్చినట్లు పెట్టేసుకుందాం అంటే కుదరదిక. మీ లగేజీ.. మీకు మరింత భారమవ్వనుంది. ఇకపై రైలులో ప్రయాణికుల లగేజీకి విమాన ప్రయాణంలో మాదిరిగా బాదుడు షురూ చెయ్యనున్నారు. ఎప్పటి నుంచో ఈ నిబంధనలున్నా.. ఇకపై తూ.చా. తప్పకుండా అమలు చెయ్యాలని నిర్ణయించారు. నిర్దేశించిన బరువు కంటే ఎక్కువ లగేజీ ఉంటే ఒకటిన్నర రెట్లు ఫైన్ పడనుంది. సీటు కంటే బ్యాగ్ సైజ్ పెద్దదైనా బాదుడు తప్పదని రైల్వే శాఖ హెచ్చరికలు జారీ చేసింది. మధ్యతరగతి ప్రయాణికులపైనే అధిక భారం మోపేందుకు రంగం సిద్ధమైంది. ఫస్ట్ క్లాస్ ఏసీ కోచ్‌లో 70 కిలోల వరకూ అనుమతి ఉండగా సెకెండ్ క్లాస్ ప్రయాణికులకు కేవలం 40 కిలోల పరిమితికి మాత్రమే అనుమతించనున్నారు.

విమానం ఎక్కేందుకు వెళ్లే ప్రయాణికుల లగేజీ బరువు కొలిచే పద్ధతి అమల్లో ఉంది. ఇప్పుడు రైలు ప్రయాణికులకూ అదే విధానం అమల్లోకి రాబోతోంది. ఇకపై లగేజీ కొలిచే విధానం రైల్వే స్టేషన్లలో కూడా ప్రారంభం కానుంది. కొత్త నిబంధనల ప్రకారం, ప్యాసింజర్లు తమ లగేజీని రైల్వే స్టేషన్లలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ వెయింగ్ మెషిన్లలో తనిఖీ చేయించుకోవాలి. రైల్వే శాఖ ప్రతి కోచ్‌కు నిర్దిష్ట లగేజీ బరువు పరిమితులను నిర్ణయించింది. నిర్దేశించిన బరువు మించితే అదనపు చార్జీలు, జరిమానాలు చెల్లించాల్సిందేనంటూ ఇండియన్ రైల్వేస్ కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. భారతదేశంలో ప్రతిరోజూ లక్షలాది మంది ప్రయాణికులు రైలులో ప్రయాణిస్తారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఈ నిబంధనలు కఠినతరం చేస్తున్నట్లు రైల్వే బోర్డు చెబుతున్నా.. ఈ నూతన నిబంధనలు.. ప్రయాణికుల జేబులకు చిల్లులు పెట్టబోతున్నాయి.

మధ్యతరగతిపైనే అధిక భారం

ఈ నిబంధనలు గతంలో ఉన్నవే అయినా.. ఇకపై కచ్చితంగా అమలు చెయ్యాలని రైల్వే శాఖ భావిస్తోంది. ప్రతి ప్రయాణికుడి లగేజీ బరువు రైల్వే కోచ్ ప్రకారం నిర్ణయించారు. ఇందులో మధ్య తరగతి ప్రయాణికులు ఎక్కువగా ప్రయాణించే సెకెండ్‌క్లాస్, థర్డ్ ఏసీ పైనే భారం ఎక్కువగా ఉండనుంది. ప్రయాణికుల తరగతిని బట్టి ఉచిత లగేజీ పరిమితిని నిర్ణయించారు. దీని ప్రకారం, ఫస్ట్ ఏసీ ప్రయాణికులు 70 కిలోల వరకు లగేజీని తీసుకెళ్లవచ్చు. సెకండ్ ఏసీ ప్రయాణికులు 50 కిలోలు, థర్డ్ ఏసీ ప్రయాణికులు 40 కేజీల వరకు లగేజీని తీసుకెళ్లవచ్చు. స్లీపర్ క్లాస్ ప్రయాణికులకు కూడా కేవలం 40 కిలోలు మాత్రమే పరిమితి విధించవచ్చు. జనరల్, సెకండ్ సిట్టింగ్ ప్రయాణికులకు కేవలం 35 కిలోల వరకు ఉచిత పరిమితి విధించారు. రైల్వే నిబంధనల ప్రకారం.. నిర్దేశించిన పరిమితి కంటే 10 నుంచి 15 కిలోల వరకు ఎక్కువ లగేజీని తీసుకెళ్లడంలో సడలింపు ఉంటుంది. కానీ బరువు అంతకంటే ఎక్కువగా ఉంటే, ప్రయాణికులు స్టేషన్‌కు వెళ్లి లగేజీని బుక్ చేసుకోవాలి. ఒకవేళ ప్రయాణికుల్లో 5 నుంచి 12 ఏళ్ల వయసున్న వారు ఉన్నట్‌లైతే అనుమతించిన దానిలో సగం లగేజీని తీసుకెళ్లేందుకు అవకాశం ఉంది.

లగేజీ పరిమితి ఇలా...

క్లాస్	ఉచిత పరిమితి	ఉచిత సడలింపు	గరిష్టం
ఫస్ట్ ఏసీ	70 కిలోలు	15 కిలోలు	150 కిలోలు
సెకెండ్ ఏసీ	50 కిలోలు	10 కిలోలు	100 కిలోలు
థర్డ్ ఏసీ	40 కిలోలు	10 కిలోలు	80 కిలోలు
స్లీపర్ క్లాస్	40 కిలోలు	10 కిలోలు	80 కిలోలు
జనరల్/సెకెండ్ సిట్టింగ్	35 కిలోలు	10 కిలోలు	70 కిలోలు

బ్యాగ్ సైజ్ పెరిగినా వాత పడుద్ది

నిర్దేశించిన పరిమితి కంటే ఎక్కువ తీసుకెళ్లినందుకు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఒక ప్రయాణికుడు బుకింగ్ పరిమితి కంటే ఎక్కువ లగేజీని తీసుకెళ్తున్నట్లు తేలితే.. సాధారణం కంటే 1.5 రెట్లు అధికంగా జరిమానా విధిస్తారు. ఈ కొత్త నిబంధనల ప్రకారం ప్రయాణ సమయంలో ప్రతి ప్రయాణికుడి లగేజీ బరువు మాత్రమే కాకుండా బ్యాగ్ పరిమాణం పైనా భారం పడనుంది. ప్రయాణికుల బ్యాగ్ చాలా పెద్దదిగా ఉండి, కోచ్‌లో ఎక్కువ స్థలాన్ని ఆక్రమిస్తే, దానిపైనా జరిమానా విధించే అవకాశం ఉందని రైల్వే బోర్డు స్పష్టం చేసింది. అంటే బరువు తక్కువగా ఉన్నప్పటికీ, పెద్ద సైజు బ్యాగ్ పట్టుకెళ్లినా భారం తప్పదన్న విషయం ప్రయాణికులు గుర్తుపెట్టుకోవాలి. అంటే బుకింగ్ లేకుండా పరిమితి కంటే ఎక్కువ బరువు తీసుకెళ్లడం ఇక జేబుకు చిల్లు పడటమేనని ప్రయాణికులు వాపోతున్నారు. కొందరు ప్రయాణికులు పరిమితికి మించి లగేజీ తీసుకెళ్తుండటం వల్ల తోటి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇకపై ఈ సమస్య లేకుండా ఉండేందుకే నిబంధనలు కఠినతరం చేస్తున్నట్లు రైల్వే అధికారులు చెబుతున్నారు. వృద్ధుల చేతి కర్రలు, హ్యాండ్ బ్యాగులు, టిఫిన్ బాక్సులపై ఈ లగేజీ పరిమితి వర్తించదని రైల్వే శాఖ స్పష్టం చేసింది. ఈ నిబంధనలు తొలుత ప్రయాగ్‌రాజ్ డివిజన్‌లోని ప్రధాన స్టేషన్లైన ప్రయాగ్‌రాజ్ జంక్షన్, కాన్పూర్ సెంట్రల్, అలీగఢ్ జంక్షన్ మొదలైన జంక్షన్లలో అమలుకు రంగం సిద్ధం చేశారు. త్వరలోనే మిగిలిన స్టేషన్లలో అమలు చేయనున్నామని రైల్వే అధికారులు వెల్లడించారు.



అభా'షూ'పాలు

- బూట్ల సైజుల్లో తేడా
- వినూత్నంగా బూట్ల మేళా

ఆరిలోవ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులందరూ సమానమని చెప్పేందుకు యూనిఫాంలు ప్రవేశపెట్టారు. అయితే కూటమి ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి, ఈసారి విద్యా వ్యవస్థలో వినూత్న మార్పులు తీసుకువచ్చింది. కొంతమంది విద్యార్థులకు ఒకే సైజు బూట్లు పంపిణీ చేయగా, మరికొందరికి వేర్వేరు సైజుల్లో పంపింది. దీంతో జిల్లాలోని 11 మండలాల్లో చాలా పాఠశాలల్లో విద్యార్థులకు సరైన సైజు బూట్లు అందలేదు. ఫలితంగా, విద్యార్థులు బూట్లు లేకుండానే పాఠశాలలకు వెళ్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేకమైన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో పంపిణీ కాకుండా ఉండిపోయిన దాదాపు 3,000 జతల బూట్లను గురువారం తోటగరువు హైస్కూల్‌లో ప్రదర్శనకు పెట్టారు. అన్ని మండలాల నుంచి వచ్చిన పాఠశాల ఉపాధ్యాయులు తమ విద్యార్థులకు అవసరమైన సైజు బూట్లను ఎంచుకుని తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమాన్ని ఆర్జేడీ విజయభాస్కర్ సందర్శించి, ఎంఈవోలకు తగిన సూచనలిచ్చారు. అయితే ఈ మేళాలో కూడా కొందరికి సరిపడా సైజులు దొరకలేదు. వారికి కొద్ది రోజుల్లో బూట్లు పంపిణీ చేస్తామని ఆర్జేడీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీసీ చంద్రశేఖర్, సీఎంవో దేవుడు, ఎంఈవోలు రవీంద్రబాబు, అనురాధ, పలు మండలాల సీఆర్‌పీలు, పీటీలు పాల్గొన్నారు.



తోటగరువు హైస్కూల్‌లో నిర్వహించిన మేళాలో బూట్లు పరిశీలిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్

దివ్యాంగుల పింఛన్లకు కోత

నోటీసులతో లబ్ధిదారుల ఆందోళన

మహారాణిపేట: జిల్లాలో కొత్త పెన్షన్ల జారీపై దృష్టి పెట్టిన కూటమి ప్రభుత్వం, ఉన్న పెన్షన్లను తొలగిస్తోందని దివ్యాంగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెన్షన్ల పునఃపరిశీలన పేరుతో అర్హులను అనర్హులుగా గుర్తించడంపై దివ్యాంగుల్లో అలజడి మొదలైంది. జిల్లాలో మొత్తం 21,306 మంది దివ్యాంగులు ఉండగా, ఇప్పటివరకు 16,187 మందికి రీ-వెరిఫికేషన్ పూర్తయింది. ఈ ప్రక్రియలో సదరం సర్టిఫికెట్ల ప్రకారం 40 శాతం లోపు దివ్యాంగత్వం ఉన్న 1,178 మంది పెన్షన్లకు అర్హత కోల్పోయారు. వీరికి ఆగస్టు నెల పెన్షన్ వచ్చే అవకాశం లేదని అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 401 మంది, పట్టణ ప్రాంతాల్లో 1,178 మందితో సహా మొత్తం 1,579 మంది దివ్యాంగులకు నోటీసులు జారీ చేశారు. అయితే నోటీసులు అందుకున్న దివ్యాంగులకు అప్పీల్‌కు అవకాశం కల్పించారు. నగరంలో జోనల్ కమిషనర్‌కు, గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీఓలకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

పెన్షన్లు కోల్పోయినవారి వివరాలు

ఆనందపురం: 124 మంది
భీమిలి: 112 మంది
పద్మనాభం: 95 మంది
పెందుర్తి: 70 మంది
పట్టణ ప్రాంతాలు (జోన్‌ల వారీగా):
జోన్-1 (భీమిలి): 175 మంది
జోన్-2 (మధురవాడ): 176 మంది
జోన్-3 (ఆశీలమెట్ట): 104 మంది
జోన్-4 (సూర్యబాగ్): 21 మంది
జోన్-5 (జ్ఞానాపురం): 54 మంది
జోన్-6 (గాజువాక): 360 మంది
జోన్-8 (పెందుర్తి): 288 మంది

మెగా లోక్ అదాలత్ విజయవంతం చేయండి

విశాఖ లీగల్ : వచ్చే నెల 13వ తేదీ జరిగే మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజా విజ్ఞప్తి చేశారు. గురువారం జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి సమావేశ మందిరంలో ఆయన ఉమ్మడి విశాఖ జిల్లాలోని అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, పాడేరు ప్రాంతాల్లోని పోలీసు ఎక్సైజ్ శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర శిక్షాస్మృతి పరిధిలోని రాజీకాగలిగిన అన్ని కేసులను పరిశీలించాలని కోరారు. ఉభయ పక్షాలకు అంగీకారమే రీతిలో కేసులను రాజీ చేసి కక్షిదారులకు లబ్ధి చేకూర్చే విధంగా సేవలందించాలన్నారు. కార్యక్రమంలో అన్ని ప్రాంతాలకు చెందిన పోలీస్ అధికారులు ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు. న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఆర్ సన్యాసినాయుడు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

న్యూస్‌రీల్

జీవీఎంసీ కౌన్సిల్ సమావేశానికి ఏర్పాట్లు



అధికారులతో కలిసి కౌన్సిల్‌హాల్‌ను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

అల్లిపురం: జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం శుక్రవారం జరగనుంది. ఏర్పాట్లను గురువారం కమిషనర్ కేతన్ గార్గ్ పరిశీలించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌ను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయనకు ఇది మొదటి కౌన్సిల్ సమావేశం. ఈ నేపథ్యంలో, కౌన్సిల్ హాల్‌లోని సభ్యులు కూర్చునే స్థలాలు, మైక్ సిస్టం, అధికారులు, మీడియా పాయింట్‌తోపాటు సమావేశం జరిగే విధానాన్ని కార్యదర్శి బి.వి. రమణను అడిగి తెలుసుకున్నారు. సభ్యులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో సభ్యులు అడిగే ప్రశ్నలకు సమాధానాలతో పాటు సంబంధిత దస్త్రాలను కూడా సిద్ధం చేసుకోవాలని అధికారులకు తెలియజేయాలని కమిషనర్ కార్యదర్శికి సూచించారు.

24న ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

మధురవాడ: ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్ బాల, బాలికలు, మహిళల జట్ల ఎంపిక ఈ నెల 24న జరగనుందని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మామిడి రమణ, ఎస్.సూర్య తెలిపారు. బోయిపాలెం జంక్షన్ వద్ద ఉన్న ఈస్టన్ విశాఖ ఇంగ్లిష్ మీడియం స్కూల్, కాలేజీ ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి ఎంపికలు జరుగుతాయని చెప్పారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు తమ ఒరిజినల్ ఆధార్, పుట్టిన తేదీ ధ్రువీకరణపత్రాలతో హాజరు కావాలని కోరారు. సబ్ జూనియర్స్ బాలురు, బాలికలు 2011 జనవరి 1 తర్వాత జన్మించిన వారై ఉండాలని స్పష్టం చేశారు. అలాగే క్రీడాకారులు తమ సొంత కిట్‌లతో రావాలని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం 98856 59016, 94900 73414 నంబర్లలో సంప్రదించవచ్చు.

భక్తులు సంతృప్తి చెందేలా సౌకర్యాలు

- కలెక్టర్ హరేంధిర ప్రసాద్
- సింహగిరిపై భక్తులకు అందుతున్న సేవలపై ఆరా

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ దేవస్థానం అధికారులకు సూచించారు. గురువారం సింహగిరిపై పర్యటించిన ఆయన భక్తులకు అందుతున్న సేవలను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో భక్తులకు అందుతున్న సేవలను స్వయంగా అడిగి తెలుసుకునేందుకు కలెక్టర్ ఈ పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు అందుతున్న మంచినీటి సదుపాయం, మరుగుదొడ్లు, పారిశుధ్యం, ప్రసాదాల నాణ్యతను పరిశీలించారు. నిత్యాన్నదాన పథకంలో అందిస్తున్న భోజనం నాణ్యతపై పలువురు భక్తులను అడిగి తెలుసుకోగా, వారు సంతృప్తి వ్యక్తం చేశారు. మెట్ల మార్గంలో వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సింహగిరిపై ఎండ వేడిమి తగ్గించేందుకు అవసరమైన చోట్ల తెలుపు రంగు పూత వేయాలన్నారు. పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రసాదాల నాణ్యత విషయంలో రాజీ పడకుండా, ముడిసరుకుల నాణ్యతను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని సూచించారు. స్వామివారి ఆభరణాలు, వస్తువులకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులపై కలెక్టర్ స్పందిస్తూ, దేవదాయ శాఖ ఆదేశాలతో ఐదుగురు సభ్యుల కమిటీ విచారణ జరుపుతోందని, నివేదిక వచ్చాక ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అంతకుముందు కలెక్టర్ స్వామివారిని దర్శించుకుని, కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన వెంట దేవస్థానం ఈఈ రమణ, ఏఈఓలు తిరుమలేశ్వర రావు, రమణమూర్తి తదితరులు ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

కేజీహెచ్‌లో వైద్యుల కొరత

- పలు విభాగాల్లో ఖాళీగా వైద్యుల పోస్టులు
- పూర్తిస్థాయిలో అందని వైద్యం
- పట్టించుకోని కూటమి సర్కార్

మహారాణిపేట: ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు వివిధ రాష్ట్రాల పేద రోగులకు వైద్య సేవలు అందిస్తున్న కింగ్ జార్జ్ ఆస్పత్రి(కేజీహెచ్)లో వైద్యుల కొరత వెంటాడుతోంది. ఇటీవల వైద్యుల బదిలీల్లో కేజీహెచ్,ఆంధ్రా మెడికల్ కాలేజీ పరిధిలో పనిచేస్తున్న పలువురు వైద్యులను రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న ఆస్పత్రులకు బదిలీ చేశారు. ముందు చూపు లేకుండా వైద్యులను బదిలీలు చేయడం వల్ల కేజీహెచ్‌లో అనేక ప్రొఫెసర్లు,విభాగాధిపతులు,అసోసియేట్ ప్రొఫెసర్లు,అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వైద్యుల కొరత వల్ల అనేక అవుట్ పేషంట్(ఓపీ) విభాగాలు, శస్త్ర చికిత్సలు నిర్వహించే ఆపరేషన్ థియేటర్ల(ఓటీ)లకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి.కొంత మంది వైద్యులపై అదనపు భారం పడుతోంది.గత రెండు నెలల నుంచి జరుగుతున్న భాగోతంపై ప్రజా ప్రతినిధులు ఎవరు నోరు మెదపడం లేదు. ఉన్న వైద్యులు పని వత్తిడి కాని,ఇతర పనుల వల్ల గాని సకాలంలో విధులకు హాజరు కాలేకపోతున్నారు. కొంత మంది ఇతర పనుల వల్ల ఓపీలకు గాని, ఓటీలకు గాని సమయ పాలన పాటించడం లేదు.దీంతో వైద్య సేవల కోసం రోగులు గంటల తరబడి పడిగాపులు పడుతున్నారు. రోగులకు అత్యవసర సేవలు అందడం గగనంగా మారుతోంది.



రోగులపై ప్రభావం

ఈ వైద్యుల కొరత వల్ల రోజుకు 1,400 నుంచి 2,000 మంది రోగులు వచ్చే అవుట్‌పేషెంట్ (ఓపీ) విభాగాల్లో, అలాగే శస్త్రచికిత్సలు జరిగే ఆపరేషన్ థియేటర్లలో తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉన్న వైద్యులపై పనిభారం పెరగడంతో రోగులకు సకాలంలో సరైన వైద్యం అందడం లేదు.

ముఖ్యంగా, కార్డియాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ, మెడికల్, సర్జికల్ ఆంకాలజీ వంటి కీలకమైన సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో ఒక్కొక్క ప్రొఫెసర్ పోస్టు ఖాళీగా ఉండటం రోగులకు మరింత సమస్యగా మారింది. ఈ పరిస్థితి గత రెండు నెలల నుంచి కొనసాగుతున్నా, కూటమి ప్రభుత్వం స్పందించడం లేదు.

కేజీహెచ్, ఆంధ్రా మెడికల్ కాలేజీల్లో మొత్తం 44 వైద్య పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటి వివరాలు..

ప్రొఫెసర్లు: 1,197 పడకలు ఉన్న ఈ ఆస్పత్రిలో, అనధికారికంగా సుమారు 2,000 మంది రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. అయితే, ప్రొఫెసర్ల పోస్టులు 11 ఖాళీగా ఉన్నాయి. నాన్-క్లినికల్ విభాగంలో ఇద్దరు ప్రొఫెసర్లు, క్లినికల్ విభాగంలో 11 మంది, సూపర్ స్పెషాలిటీ విభాగంలో ఐదుగురు ప్రొఫెసర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

అసోసియేట్ ప్రొఫెసర్లు: ఈ పోస్టులు ఆరు ఖాళీగా ఉన్నాయి. నాన్-క్లినికల్ విభాగంలో ఒకరు, క్లినికల్ విభాగంలో ఐదుగురు, సూపర్ స్పెషాలిటీ విభాగంలో ఇద్దరు.

అసిస్టెంట్ ప్రొఫెసర్లు: ఈ పోస్టులు 15 ఖాళీగా ఉన్నాయి. నాన్-క్లినికల్ విభాగంలో ఆరుగురు, క్లినికల్ విభాగంలో 15 మంది, సూపర్ స్పెషాలిటీ విభాగంలో ఏడుగురు.

అంగన్‌వాడీల బ్లాక్ డే

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నల్లరిబ్బన్లతో అంగన్‌వాడీల నిరసన

బీచ్‌రోడ్డు : అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నల్ల రిబ్బన్‌లు ధరించి మానవహారం నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గాంధీ విగ్రహానికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) జిల్లా కార్యదర్శి ఎం. వెంకటలక్ష్మి మాట్లాడుతూ, వేతనాలు పెంచడం, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించకుండా పనిభారం పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాల పెంపు, గ్రాట్యుటీ సవరణ, సంక్షేమ పథకాల అమలు, యాప్‌ల సవరణ, వేసవి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోషణ ట్రాకర్, బాల సంజీవిని యాప్‌లలో 'ఫేస్ రికగ్నిషన్ సిస్టం' తప్పనిసరి చేయడం వల్ల అంగన్‌వాడీ టీచర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీని వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు.



జీవీఎంసీ గాంధీబొమ్మ వద్ద నిరసన చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్

జూలై నెలలో యాప్ సమస్యలను వివరించినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆగస్టు 4న మొబైల్స్ తిరిగి ఇచ్చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు పి. శ్యామలాదేవి, ఏ. నూకరత్నం, పి. కృపారాణి, సుబ్బలక్ష్మి, రాధ, మంగ, విజయ, అన్నపూర్ణ, సంతోషి, భవాని, బీబీ రామాయమ్మ, దేవి, అరుణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పట్టించుకోని కూటమి ప్రభుత్వం

మర్రిపాలెం: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి కనీస వేతనాలు చెల్లించాలని కోరుతూ అంగన్‌వాడీలు గురువారం ఆర్అండ్‌బి జంక్షన్ వద్ద ఉన్న ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అధికారంలోకి వస్తే తమ సమస్యలు పరిష్కరిస్తామని టీడీపీ నాయకులు హామీ ఇచ్చారని, కానీ ఇప్పుడు అంగన్‌వాడీలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ నిరసన అనంతరం సీడీపీఓ నీలిమకు వినతిపత్రాన్ని సమర్పించారు.

ఇటలీలో విశాఖ యువకుడి ప్రతిభ

- లఘు చిత్రాలతో మెప్పించిన వైనం
- శ్రీహరివర్మకు 7 అవార్డులు

కొమ్మాది: తనలోని సృజనాత్మకతకు పదును పెట్టి ప్రపంచ వేదికపై తన ప్రతిభను చాటాడు. జిల్లాకు చెందిన సాగి శ్రీహరివర్మ, ఇటలీలో జరిగిన ప్రతిష్టాత్మక 'సిని మధమారే' (ఇటాలియన్ ఫిల్మ్ మేకింగ్ ప్రోగ్రామ్)లో అద్భుతమైన ప్రదర్శనతో ఏకంగా ఏడు అవార్డులను గెలుచుకుని భారతదేశానికి గర్వకారణంగా నిలిచాడు. వివిధ దేశాల నుంచి 60 మంది యువకులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో భారతదేశం తరపున శ్రీహరివర్మ ఒక్కడే ప్రాతినిధ్యం వహించడం విశేషం. ఇటలీలో జూలై 1 నుంచి 27వ తేదీ వరకు జరిగిన పోటీలు నిర్వహించగా..ఇటీవల విజేతలను ప్రకటించారు. శ్రీహరి నాలుగు లఘు చిత్రాలకు కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం, నిర్మాణం వంటి కీలక బాధ్యతలు నిర్వర్తించాడు. అతని ప్రతిభకు నిలువుటద్దంగా నిలిచిన 'సిగ్నల్', 'గ్రాండ్ థెఫ్ట్ ఫియెట్' లఘు చిత్రాలకు ఉత్తమ నిర్మాణ అవార్డులు దక్కాయి. అంతేకాకుండా 'సిగ్నల్' చిత్రానికి ఉత్తమ సినిమాటోగ్రఫీ అవార్డు, 'సిగ్నల్', 'టూరిస్ట్ పిల్‌గ్రిమేజ్' చిత్రాలలో ఉత్తమ నటుడిగా అవార్డులను కైవసం చేసుకున్నాడు. అలాగే 'సిగ్నల్' చిత్రానికి ఉత్తమ సౌండ్, 'గ్రాండ్ థెఫ్ట్ ఫియెట్' చిత్రానికి ఉత్తమ ఎడిటింగ్ అవార్డులను కూడా సాధించాడు.



ఇటలీలో లఘు చిత్రం చిత్రీకరణలో శ్రీహరివర్మ

చాలా ఆనందంగా ఉంది



అంతర్జాతీయ వేదికపై ఏడు అవార్డులను గెలుచుకోవడం ఆనందంగా ఉంది. ఈ విజయంతో నా తల్లిదండ్రులు ఎస్వీఎస్ఎస్ రాజు, అనురాధ చాలా సంతోషం వ్యక్తం చేశారు. 'సిగ్నల్' లఘు చిత్ర కథాంశంతో ఒక పూర్తిస్థాయి సినిమాను తీసేందుకు స్క్రిప్ట్ సిద్ధం చేస్తున్నా.. త్వరలో దానిని తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నాను.

– శ్రీహరివర్మ, అవార్డు గ్రహీత

రేపు 'వర్షాకాలం పరిశుభ్రత'



మహారాణిపేట: ఆగస్టు థీమ్ అయిన 'వర్షాకాలం పరిశుభ్రత'పై దృష్టి సారించి కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 23న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో, ప్రజల్లో పారిశుధ్య విలువలను ప్రోత్సహించాలని సూచించారు. అన్ని విభాగాల అధికారులు ఈ కార్యక్రమాలను తప్పనిసరిగా పర్యవేక్షించాలని, ముఖ్యంగా డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించాలని, కమ్యూనిటీ టాయిలెట్లు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు గాను, నీటి ద్వారా వచ్చే వ్యాధుల గురించి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.



కంచరపాలెం: కేంద్రీయ విద్యాలయ-2 ప్రాంగణం .. విద్యార్థుల సందడితో పండగ వాతావరణం నెలకొంది. జాతీయ సమైక్యతను చాటే లక్ష్యంతో ఏర్పాటు చేసిన 'కళా ఉత్సవ్' (జాతీయ ఐక్యత దివాస్) గురువారం వైభవంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరగనున్న ఈ వేడుకలను మేనేజింగ్ కమిటీ చైర్మన్ కమాండర్ ధీరజ్ కన్న, చైర్మన్ నామినీ కమాండ్ సోనాల్ ద్రావిడ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా

అట్టహాసంగా 'కళా ఉత్సవ్'



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

కమాండర్ ధీరజ్ కన్న మాట్లాడుతూ ఇలాంటి ఉత్సవాలు విద్యార్థుల్లో కళలు, సాంస్కృతిక విలువలపై అవగాహన కల్పించడమే కాకుండా, వారిలో జాతీయ సమైక్యతా భావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని 8 క్లస్టర్లకు చెందిన 72 పాఠశాలల నుంచి సుమారు 420 మంది విద్యార్థులు ఈ ఉత్సవాల్లో పాల్గొనడం విశేషం. వారు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, వినూత్నంగా రూపొందించిన ప్రయోగాలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సి.హెచ్.శ్రీనివాసులు, సిబ్బంది బాలాజీ, రామ్‌భూపాల్, జ్యోతిప్రకాష్, వినోద్, బాషా తదితరులు పాల్గొన్నారు.

భారీ దొంగతనం కేసులో ముగ్గురి అరెస్ట్

72 తులాల బంగారం,
రూ. 9.04 లక్షలు స్వాధీనం



రికవరీ సొత్తును చూపుతున్న డీసీపీ లతామాధురి

అల్లిపురం: శీలానగర్‌లోని విజయ దుర్గ పాలిమర్స్ కంపెనీ యజమాని ఫ్లాట్‌లో ఈ ఏడాది జూలై 13న జరిగిన దొంగతనం కేసును నగర క్రైం పోలీసులు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఛేదించారు. ఈ కేసుకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి 72 తులాల బంగారు ఆభరణాలు, రూ.9.04 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. నగర పోలీస్ కమిషనరేట్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రైం డీసీపీ కె. లతామాధురి ఈ కేసు వివరాలను వెల్లడించారు. శీలానగర్‌లోని వేంకటేశ్వర కాలనీ, లక్ష్మి అపార్ట్‌మెంట్‌లో సప్ప నాగమణి కుటుంబంతో నివాసం ఉంటున్నారు. ఆమె ఫ్లాట్‌లో పాలిషింగ్ పనులు జరుగుతుండటంతో.. జూలై 12న రాత్రి 10.30 గంటలకు తన భర్త, చిన్న కూతురుతో కలిసి కింద ఫ్లోర్‌లోని మరో ఫ్లాట్‌లో నిద్రపోయారు. జూలై 13న తెల్లవారుజామున 4.25 గంటలకు తిరిగి తమ ఫ్లాట్‌కు రాగా.. ఇంటి ప్రధాన ద్వారం తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. లోపల బీరువా లాకర్ కూడా పగలగొట్టి ఉండగా.. అందులో ఉన్న సుమారు 100 తులాల బంగారు ఆభరణాలు, రూ.13.5 లక్షల నగదు కనిపించలేదు. దీనిపై ఆమె గాజువాక క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసుపై దర్యాప్తు చేపట్టిన క్రైం పోలీసులు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో అర్జున జ్ఞాన ప్రకాష్, లింగిబెడి రాంబాబులు ఈ చోరీ చేసినట్లు గుర్తించారు. వీరు తెలంగాణ రాష్ట్రం మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఒక హత్య కేసులో నిందితులుగా చంచల్‌గూడ జైలులో ఉన్నారు. సౌత్ జోన్ క్రైం ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం మలక్‌పేట వెళ్లి నిందితులను విచారించింది. విచారణలో నర్సీపట్నం, అయ్యన్న కాలనీ, పీనరిపాలెం ప్రాంతానికి చెందిన చిటికల నాగేశ్వరరావు అలియాస్ నాగేష్ ఈ దొంగతనానికి సూత్రధారి అని తేలింది. సాంకేతిక ఆధారాల సహాయంతో పోలీసులు గాజువాక బి.సి.రోడ్డులోని మసీదు వద్ద నాగేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడితో పాటు చంచల్‌గూడ జైలు నుంచి పీటీ వారెంట్‌పై తీసుకొచ్చిన ఆ ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

తల్లి నేత్రాలు దానం

పెద్ద మనసు చాటుకున్న రాకేష్



వరలక్ష్మి(ఫైల్)

పెందుర్తి: అనారోగ్యంతో మరణించిన తల్లి నేత్రాలను దానం చేసి ఒక కుమారుడు మానవత్వాన్ని చాటుకున్నాడు. పెందుర్తిలోని రాచ్చెరువు ప్రాంతానికి చెందిన 46 ఏళ్ల బత్తుల వరలక్ష్మి ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ గురువారం మరణించారు. ఈ విషయం తెలుసుకున్న సాయి హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు దాడి శ్రీనివాస్.. వరలక్ష్మి నేత్రాలను దానం చేయాల్సిందిగా ఆమె కుమారుడు రాకేష్‌ను కోరారు. రాకేష్‌తో పాటు కుటుంబ సభ్యులు అందుకు అంగీకరించారు. దీంతో మోషిన్ ఐ బ్యాంక్ ప్రతినిధి మనోజ్ తన బృందంతో వచ్చి వరలక్ష్మి నేత్రాలను సేకరించారు.

దేశ రక్షణలో తెలుగు బిడ్డ సాహసం

కీర్తి చక్ర గ్రహీత మేజర్ రామ్ గోపాల్ నాయుడుకు ఘన సన్మానం



మేజర్ రామ్ గోపాల్ నాయుడును సత్కరిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

పీఎంపాలెం: దేశ రక్షణ కోసం ప్రాణాలకు తెగించి పోరాడి ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టిన మేజర్ రామ్ గోపాల్ నాయుడు యువతకు ఆదర్శనీయుడని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. ఇటీవలే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా కీర్తి చక్ర పురస్కారం అందుకున్న మేజర్ రామ్ గోపాల్ నాయుడు దంపతులకు ఫైర్ అండ్ సేఫ్టీ, శ్రీ వృక్ష, మాలతాంబ విద్యాసంస్థల ఆధ్వర్యంలో గురువారం కారుషెడ్‌లోని శ్రీవృక్ష జూనియర్ కాలేజీ ప్రాంగణంలో ఘన సన్మానం జరిగింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన మేజర్ రామ్ గోపాల్ నాయుడు చేసిన సాహసానికి యావత్ దేశం ఫిదా అయిందని సీపీ కొనియాడారు. జమ్ము కశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో నిర్వహించిన ఆపరేషన్‌లో ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టి నిజమైన హీరోగా నిలిచాడని ప్రశంసించారు. 78 ఏళ్ల స్వతంత్ర భారతదేశ చరిత్రలో కీర్తి చక్ర పురస్కారం అందుకున్న తొలి తెలుగు వ్యక్తి మేజర్ రామ్ గోపాల్ నాయుడు అని చెప్పారు. ఈ సందర్భంగా మేజర్ రామ్ గోపాల్ నాయుడు దంపతులను ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి రామ్ గోపాల్ నాయుడు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పట్టుదల, నిలకడ, సహనం వంటి ఉత్తమ లక్షణాలను అలవర్చుకోవాలని హితవు పలికారు. దేశ రక్షణ బాధ్యతల్లో ఎన్నో కఠినమైన, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటామని, అయినప్పటికీ తమ లక్ష్యంపై పూర్తి దృష్టి పెడతామని చెప్పారు. ఈ సందర్భంగా దేశ రక్షణలో తాము ఎదుర్కొన్న సాహస ఘట్టాలను ఉద్వేగభరితంగా వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఐఎఫ్‌ఎస్, మాలతాంబ విద్యాసంస్థల అధినేత సునీల్ మహంతి, శ్రీ వృక్ష విద్యాసంస్థల కరస్పాండెంట్ బి.వెంకటరమణ మూర్తి, విశ్రాంత ఎస్పీ దివాకర్, మాలతాంబ విద్యానికేతన్ జీఎం జి.పి.ఆర్.కృష్ణ, ప్రిన్సిపాల్ బి.శ్రీదేవి, మేజర్ రామ్ గోపాల్ నాయుడు కుటుంబ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీతో బలమైన ఆంధ్రప్రదేశ్‌గా ఎదగాలి



సీఐఐ సదస్సులో పాల్గొన్న ప్రముఖులు

గోపాలపట్నం : ఆంధ్రప్రదేశ్‌ను సైబర్ సెక్యూరిటీలో బలమైన రాష్ట్రంగా మార్చాలని ఎఫిసెన్స్ సిస్టమ్స్ ఫౌండర్, చైర్మన్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సీఐఐ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరిగిన 'డిజిటల్ బ్యాక్‌బోన్ భద్రత-ఏఐ, సైబర్ రిస్కుల నేపథ్యంలో నమ్మకాన్ని పెంచడం' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ఈ విషయం చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో 700కు పైగా సేవలను వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందిస్తున్నామని, అయితే ఈ డిజిటల్ యుగంలో సైబర్ భద్రత చాలా అవసరమని ఆయన అన్నారు. సైబర్ దాడుల వల్ల కలిగే నష్టాలను గురించి ఆయన వివరించారు. ఈ సదస్సులో ఇన్ఫోసిస్, ఐబీఎం వంటి సంస్థల నిపుణులు సైబర్ భద్రత, ఏఐ ఆధారిత దాడులు, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి అంశాలపై ప్రసంగించారు. ఓటీపీ, ఈ-కేవైసీ మోసాలను నివారించడంపైనా చర్చించారు. కార్యక్రమంలో గుంటూరు శివకుమార్, కారణ్ సజ్నాని, బ్రిజేష్ బాలకృష్ణన్, అజయ్ కులకర్ణి, సంజయ్ చిట్బోరే, సీపీ శంఖబ్రత బాగ్చి పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

దర్యాప్తు కోరిన తల్లి



ప్రవల్లిక (ఫైల్)

గాజువాక: తల్లితో కలిసి అక్కిరెడ్డిపాలెంలో నివాసముంటున్న ఒక యువతి గురువారం ఆత్మహత్య చేసుకుంది. మృతిపై వివరాలు తెలియరాలేదు. తన కుమార్తె ఒక వ్యక్తితో ప్రేమలో ఉన్నట్టు తెలిసిందని, అందువల్ల ఈ మృతిపై తగిన దర్యాప్తు చేయాలని ఆమె తల్లి పోలీసులను కోరింది. వివరాలివి. అక్కిరెడ్డిపాలెంలో నివాసముంటున్న కోట్ని కనకమహాలక్ష్మి భర్త 15 కిందట మృతి చెందారు. అప్పటినుంచి కుమార్తె ప్రవల్లిక (23), కుమారుడు సాయి సంపత్‌తో కలిసి అక్కిరెడ్డిపాలెంలోని తమ తల్లిదండ్రులు ఉంటున్న వీధిలోనే నివాసముంటోంది. ప్రవల్లిక ఇటీవల ఎమ్మెస్సీ పూర్తి చేసి కాంపిటేటివ్ పరీక్షలకు సాధన చేస్తోంది. కనక మహాలక్ష్మి, ఆమె కుమారుడు టయోటా కార్ల షోరూమ్‌లో పని చేస్తున్నారు. వారిద్దరూ ఎప్పటి మాదిరిగానే డ్యూటీకి వెళ్లిపోయారు. అదే వీధిలో నివాసముంటున్న కనక మహాలక్ష్మి తల్లి ఉదయం 11 గంటల సమయంలో మనవరాలి వద్దకు వచ్చింది. తాను సచివాలయానికి వెళ్తానని మనవరాలు చెప్పడంతో ఆమె తన ఇంటికి వెళ్లిపోయింది. తిరిగి ఒంటి గంట సమయంలో మళ్లీ మనవరాలి వద్దకు వచ్చి పిలవగా ఎంతసేపటికీ తలుపు తీయలేదు. దీంతో కిటికీలోంచి చూడగా బెడ్‌రూమ్‌లోని ఫ్యాన్ హుక్‌కు ప్రవల్లిక ఉరి వేసుకొని కనిపించింది. వెంటనే ఆమె తన భర్తకు విషయాన్ని చెప్పడంతో ఇంటి వెనుకభాగంలో గల తలుపును బలవంతంగా తెరిచి లోపలికి వెళ్లి చూశారు. ఫ్యాన్‌కు వేలాడుతున్న ప్రవల్లికను కిందికి దించి దగ్గరలోగల ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆమె అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న కనక మహాలక్ష్మి హుటాహుటిన వచ్చి ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన కుమార్తె నిఖిల్ అనే యువకుడితో ప్రేమలో ఉన్నట్టు తెలిసిందని, అందువల్ల ఈ మృతిపై దర్యాప్తు చేయాలని ఫిర్యాదులో కోరింది.

ఉత్కంఠగా రైల్వేస్ బాల్ బ్యాడ్మింటన్ పోరు

విశాఖ స్పోర్ట్స్: ఆల్ ఇండియా రైల్వే బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో దక్షిణ మధ్య రైల్వే జట్టు అద్భుతమైన ప్రదర్శనతో ఆధిపత్యం కొనసాగిస్తుండగా, పశ్చిమ రైల్వే జట్టు గట్టి పోటీనిస్తోంది. గురువారం రైల్వే స్టేడియంలోని బాల్ బ్యాడ్మింటన్ కోర్టుల్లో జరిగిన 8 మ్యాచ్‌లు ఉత్కంఠగా సాగాయి. ముఖ్యంగా దక్షిణ మధ్య రైల్వే, నైరుతి రైల్వే మధ్య జరిగిన మ్యాచ్‌లో ఇరు జట్లు చెరో సెట్ గెలుచుకోవడంతో మ్యాచ్ డిసైడింగ్ సెట్‌కు దారితీసింది. చివరికి దక్షిణ మధ్య రైల్వే 35-23 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. ఇతర మ్యాచ్‌ల్లో పశ్చిమ రైల్వే, ఐసీఎఫ్ జట్లు రెండేసి విజయాలు నమోదు చేశాయి. ఈసీఆర్, ఎస్‌ఆర్ జట్లు ఒక్కో మ్యాచ్‌లో విజయం సాధించాయి. రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో జరుగుతున్న చాంపియన్‌షిప్‌లో మొత్తం ఏడు రైల్వే జోన్ జట్లు పాల్గొంటున్నాయి.

గంజాయి రవాణా కేసులో మరో ముగ్గురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవికుమార్

మద్రిపాలెం: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో ఊహించని మలుపు చోటు చేసుకుంది. ప్రమాదానికి కారణమైన కారులో గంజాయిని గుర్తించిన పోలీసులు, ఆ కేసులో పరారీలో ఉన్న మరో ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయాన్ని గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ రవికుమార్ వెల్లడించారు. ఈ నెల 12న సుభాష్‌నగర్ వద్ద జరిగిన ప్రమాదంలో ఒక కారు ఢీకొని ఏడాదిన్నర చిన్నారి వర్షిత్ మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ ఘటన తర్వాత కారు డ్రైవర్, తమిళనాడుకు చెందిన అర్జునన్ జెమినీ అధ్యుమను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే ప్రమాదం జరిగినప్పుడు కారులో ఉన్న మరో ముగ్గురు పరారయ్యారు. పోలీసులు ఈ నెల 16న సీజ్ చేసిన కారును తనిఖీ చేయగా.. అందులో 21 కిలోల గంజాయిని గుర్తించారు. విచారణలో భాగంగా పరారీలో ఉన్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో హైదరాబాద్‌లోని హాస్టల్‌లో ఉంటున్న గుంటూరుకు చెందిన 20 ఏళ్ల అక్షయ గౌతమి, ఒంగోలుకు చెందిన 25 ఏళ్ల పెర్లి విజయవర్ధన్ రాజు, గుంటూరుకు చెందిన 19 ఏళ్ల షేక్ మహమ్మద్ జాకీర్ ఉన్నారని సీఐ తెలిపారు. ఈ నలుగురు విజయవాడలో కారు అద్దెకు తీసుకుని అరకు వెళ్లి అక్కడ గంజాయి కొనుగోలు చేశారు. తిరిగి వస్తుండగా ఊర్వశి జంక్షన్ సమీపంలోని సుభాష్‌నగర్ వద్ద ప్రమాదం జరిగింది. నిందితుల్లో ఒకరైన పెర్లి విజయవర్ధన్ రాజుపై ఇప్పటికే ఒంగోలులో 11 కేసులు ఉన్నాయని, మరొక నిందితుడు మహమ్మద్ జాకీర్‌పై కూడా గంజాయి కేసు ఉందని పోలీసులు వెల్లడించారు. యువతికి తల్లిదండ్రులు లేరు. విజయవర్ధన్‌కు బంధువు కావడంతో అతనితో ఇలా వెళ్తూ ఉంటుంది. ఈ కేసులో ప్రతిభ చూపించిన ఎస్‌ఐలు షేక్ సమీర్, రవికుమార్‌లను సీఐ అభినందించారు.

ఏపీఎల్ టైటిల్ పోరుకు రాయల్స్

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) నాలుగో సీజన్ తొలి క్వాలిఫయర్ మ్యాచ్‌లో అమరావతి రాయల్స్ విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. వైఎస్సార్ స్టేడియంలో గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో తుంగభద్ర వారియర్స్‌పై రాయల్స్ ఎనిమిది వికెట్ల తేడాతో గెలుపొందింది. టైటిల్ పోరులో ప్రవేశించడానికి మరో బెర్తు కోసం భీమవరం బుల్స్, తుంగభద్ర వారియర్స్ మధ్య క్వాలిఫయర్-2 మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన తుంగభద్ర వారియర్స్ ఆరంభంలోనే తడబడింది. 60 పరుగులకే ఆరు కీలక వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ జ్ఞానేశ్వర్ 21 పరుగులు చేసి కొంత ఊరటనిచ్చాడు. ఆ తర్వాత కెప్టెన్ మహీప్ కుమార్ (56), శశికాంత్ (41) రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 136 పరుగులు చేయగలిగింది. కెప్టెన్ హనుమ విహారి మూడు, వినయ్ కుమార్ రెండు వికెట్లు పడగొట్టారు. 137 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన అమరావతి రాయల్స్ కేవలం 14.2 ఓవర్లలోనే రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఓపెనర్లు ప్రణీత్ (32), రాహుల్ (44) శుభారంభం అందించగా, కెప్టెన్ హనుమ విహారి (54) అర్ధశతకంతో జట్టును విజయతీరాలకు చేర్చాడు.

ఇంటిదారి పట్టిన సన్‌షైనర్స్

వైఎస్సార్ స్టేడియంలో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో భీమవరం బుల్స్ విజయం సాధించింది. కెప్టెన్ హేమంత్ అద్భుతమైన బ్యాటింగ్‌తో జట్టును గెలిపించి క్వాలిఫయర్ మ్యాచ్‌కు చేర్చాడు. ఈ ఓటమితో విజయవాడ సన్‌షైనర్స్ టోర్నమెంట్ నుంచి నిష్క్రమించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన విజయవాడ సన్‌షైనర్స్ నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 160 పరుగులు చేసింది. ఓపెనర్ అభినవ్ (54), మిడిల్ ఆర్డర్‌లో ధీరజ్ (51) అర్ధసెంచరీలతో రాణించారు. శివ నాలుగు వికెట్లు పడగొట్టగా, కెప్టెన్ హేమంత్ రెండు వికెట్లు తీసి ప్రత్యర్థిని కట్టడి చేశారు. 161 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భీమవరం బుల్స్ 19.2 ఓవర్లలో కేవలం 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. కెప్టెన్ హేమంత్ 43 బంతుల్లోనే 3 ఫోర్లు, 6 సిక్సర్లతో 71 పరుగులు చేసి, జట్టును విజయతీరాలకు చేర్చారు.

స్వర్ణాంధ్ర సాధనపై సమీక్ష



వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.వి జయానంద్ గురువారం ఏపీ సచివాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్ పాల్గొన్నారు. స్వర్ణాంధ్ర సాధనలో భాగంగా తీసుకుంటున్న చర్యలను ఆయనకు వివరించారు. కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ కి సంబంధించిన నివేదికలను సమర్పిస్తామన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ సత్తిబాబు, డీపీఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ విభాగాధిపతిపై ఫిర్యాదు

బీచ్‌రోడ్డు: ఆంధ్రా యూనివర్సిటీలో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగంలో పీహెచ్‌డీ ప్రవేశం పొందిన క్షీరసాగర్ గోగులమూడి అనే విద్యార్థి.. తనను విభాగాధిపతి చేర్చుకోకుండా వేధిస్తున్నారని ఆరోపిస్తూ మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 'ఏయూ వీసీ సూచన మేరకు జాయినింగ్ రిపోర్ట్‌ను సమర్పించడానికి విభాగానికి వెళ్లగా.. విభాగాధిపతి జాలాది రవికుమార్ జాయినింగ్ రిపోర్ట్‌ను స్వీకరించడానికి నిరాకరించారు. అంతేకాకుండా తనను అవమానకరంగా చూస్తూ నువ్వు లోపలికి రావద్దు, బయటకు వెళ్లిపో' అని దుర్భాషలాడారని క్షీరసాగర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంకట అప్పారావు, నర్సింగ్ అనే ఇద్దరు వ్యక్తులతో.. ఇతరుల సమక్షంలో తన షర్ట్ కాలర్ పట్టుకొని బయటకు తోసి.. తన జాయినింగ్ రిపోర్ట్‌ను ఆఫీస్ బయటకు విసిరేశారని వివరించారు. విభాగాధిపతిపై విచారణ జరిపి తగిన న్యాయం చేయాలని క్షీరసాగర్ కోరారు. ఈ ఫిర్యాదుపై విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

4న అగ్నిమాపక కేంద్రంలో పాత సామగ్రి వేలం

అల్లిపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో నిరుపయోగంగా ఉన్న అగ్నిమాపక పరికరాలకు వేలం నిర్వహించనున్నారు. ఈ వేలం ప్రక్రియ సెప్టెంబర్ 4వ తేదీ ఉదయం 10.30 గంటలకు సూర్యాబాగ్, పోలీస్ బ్యారెక్స్‌లోని నార్త్ జోన్-1 అగ్నిమాపక కేంద్రంలో జరుగుతుందని జిల్లా అగ్నిమాపక సేవల అధికారి తెలిపారు. ఆసక్తి ఉన్నవారు మహారాణిపేట, దండుబజారులోని జిల్లా విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ కార్యాలయంలో మరింత సమాచారం తెలుసుకోవచ్చు.

కసాయి తండ్రికి 20 ఏళ్ల జైలు

- పోక్సో న్యాయస్థానం సంచలన తీర్పు
- ఇద్దరు కూతుళ్లపై లైంగిక దాడి
- ప్రభుత్వం పరిహారంగా రూ.3 లక్షలు

విశాఖ లీగల్ : కన్న తండ్రి కర్కశంగా వ్యవహరించాడు. వావివరసలు మరిచి తన ఇద్దరు కుమార్తెలపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడికి పోక్సో ప్రత్యేక న్యాయస్థానం గురువారం 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. జైలు శిక్షతోపాటు రూ. 3,000 జరిమానా చెల్లించాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బత్తి రాజశేఖర్ తెలిపిన వివరాలు ప్రకారం.. ఈ కేసులోని నిందితుడు చిత్తరంజన్ పాత్రో ఒడిశాకు చెందినవాడు. అతను విశాఖలోని ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుర్గాలమ్మ గుడి దగ్గర నివాసం ఉంటున్నాడు. పాత్రోకు ఇద్దరు కుమార్తెలు (12, 8 ఏళ్ల వయసు), ఒక కుమారుడు ఉన్నారు. అతని భార్య రాత్రి వేళల్లో కార్పొరేట్ ఆస్పత్రిలో ఫ్లోర్ ఇన్‌చార్జిగా పని చేసేవారు. ఈ నేపథ్యంలో పాత్రో .. గత ఏడాది సెప్టెంబర్ 14వ తేదీకి ముందు నుంచి తరచూ తన కుమార్తెలపై లైంగిక దాడికి పాల్పడేవాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించి, వారిని కొట్టి ఈ దారుణానికి పాల్పడేవాడు. తండ్రి కిరాతకాన్ని భరించలేని బాలిక తన పాఠశాల టీచర్‌కు విషయం చెప్పింది. టీచర్ ఆ బాలిక తల్లికి తెలియజేయడంతో, ఆమె గత ఏడాది సెప్టెంబర్ 24న ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసును దిశ పోలీస్ స్టేషన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఈ. పెంటారావు దర్యాప్తు చేసి, నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. న్యాయస్థానంలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ కఠినమైన శిక్షను విధించారు. బాధితులైన బాలికలు ప్రభుత్వ సహాయం పొందవచ్చని, ఇందుకు న్యాయసేవ ప్రాధికార సంస్థ సహాయం అందించాలని కూడా న్యాయమూర్తి సూచించారు.

నేషనల్ సిల్క్ ఎక్స్‌పోలో 50 శాతం తగ్గింపు



ప్రదర్శనలో వస్త్రాలను ప్రదర్శిస్తున్న మోడల్

అల్లిపురం: రాబోయే పండగలు, వివాహ వేడుకల కోసం ప్రత్యేకంగా రూపొందించిన అద్భుతమైన వస్త్రాల ప్రదర్శన, అమ్మకాలు గురువారం గ్రీన్ పార్క్ హోటల్‌లో ప్రారంభమయ్యాయి. 'నేషనల్ సిల్క్ ఎక్స్‌పో' పేరిట నిర్వహిస్తున్న ఈ ప్రదర్శన ఈ నెల 26వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. వినాయక చవితి, దసరా, వివాహాది వేడుకలకు అవసరమైన సంప్రదాయ, ఆధునిక ఫ్యాషన్ల సమ్మేళనంతో విభిన్న వస్త్రాలను ఈ ప్రదర్శనలో ఉంచినట్లు చెప్పారు. వేలాది రకాల పట్టు, కాటన్ డిజైన్ వస్త్రాలు, డిజైనర్ చీరలు, బ్లౌజులు, కుర్తీలు మొదలైన వాటిని 50 శాతం వరకు తగ్గింపు ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఎక్స్‌పో సందర్శకులకు అందుబాటులో ఉంటుందని, ప్రవేశం ఉచితమన్నారు. అన్ని డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా చెల్లింపులు స్వీకరిస్తామని వివరించారు.